క్లుప్తంగా

బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడి నియామకం

మాక్లూర్: మండల బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడిగా డి రాజేశ్వర్, గిరిజన మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా వినోద్ నాయక్‌ను నియమించినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ సురేష్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియామకపు పత్రాలను అందించినట్టు వెల్లడించారు. నాయకులు చింత ప్రవీణ్, ముప్పా గంగారెడ్డి, రాజులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కల గుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. వీడీసీ ఆధ్వర్యంలో ఆలయ పునరి ర్మాణం చేపడుతున్నారు.

గురుకుల పాఠశాలలకు 15 మంది ఎంపిక



వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ ప్రైమరీ స్కూలుకు చెందిన 15 మంది విద్యార్థులు ఐదో తరగతిలో వివిధ గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు హెచ్ఎం జమాలుద్దీన్ శనివారం తెలిపారు. పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 15 మంది ఎంపికయ్యారని, 2012 నుంచి ఇప్పటిదాకా తమ పాఠశాల నుండి 220 మంది గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

సత్తా చాటిన వేంపల్లి విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 24 మంది విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. అలాగే ముప్కాల్ మండలం రెంజర్లలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలకు చెందిన 58 విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కన్వీనర్ నిషార్ తెలిపారు.

స్కూల్ బస్సు డ్రైవర్ తప్పిదంపై చర్యలు తీసుకోవాలి



బోధన్‌రూరల్/బోధన్‌టౌన్: పట్టణంలోని ఆదిత్య హైస్కూల్ బస్సు తప్పిదంపై మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని టీజీవీపీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నగేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 18న హైస్కూల్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి రైలు వచ్చే సమయంలో గేట్ల మధ్యలోకి స్కూల్ బస్సును తేవడంపై ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. అధికారులు పూర్తి విచారణ జరిపి యాజమాన్యం, బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శివ, పీరాజీ తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత

రెంజల్(బోధన్): మూడు నెలల కిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి శనివారం బాధితునికి అప్పగించారు. నీలా గ్రామానికి చెందిన సందీప్ సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో నుంచి దొంగిలించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకుని శనివారం అందించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. సీఈఐఆర్ కానిస్టేబుల్ గణేశ్ ఉన్నారు.

‘అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిద్దాం’



బోధన్‌టౌన్(బోధన్): అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని ఏసీపీ విష్ణు మూర్తి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. 1944 ఏప్రిల్ 14న ముంబైలో ఘోర అగ్ని ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బంది స్మారకార్థం దేశ వ్యాప్తంగా అగ్నిమాపక దళ దినోత్సవం ఏప్రిల్ 14న నిర్వహిస్తారని తెలిపారు. అగ్నిమాపక కార్యాలయ అధికారి గంగాదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



వెల్మల్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. వెల్మల్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. అకాల వర్షం వల్ల ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. యుద్ధప్రాతిపదికన వరిధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని ప్రభుత్వ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.మండల పార్టీ అధ్యక్షుడు భూతం సాయరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పల్లెపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

- క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు
- పంట నష్టం వివరాల నమోదు



నందిపేట మండలం శాపూర్‌లో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నందిపేట్(ఆర్మూర్): మండల పరిధిలో వడగళ్ల వానకు నష్టపోయిన పంటలను శనివారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. 50 ఎకరాల వరకు వరి పంట నష్టం జరిగినట్లు, 5 ఎకరాలలో మామిడి పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేశామని వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోత్స్న భవాని తెలిపారు.



మాక్లూర్: తడిసిన ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో రైతు

నవీపేట పరిధిలో 80 ఎకరాల్లో నష్టం

నవీపేట: శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాలలో వరి పంటతో పాటు మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో నవీపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. అంజుమాన్ ఫారమ్, నవీపేట, శాఖాపూర్, నాగేపూర్ శివార్లలోని మామిడి తోటల్లో మామిడి కాయలు నేలమట్టమయ్యాయి. వ్యవసాయాశాఖ అధికారులు పంట నష్టంపై సర్వే చేపట్టారు. 80 ఎకరాలలో పూర్తిగా వరి పంటకు నష్టం జరుగగా మూడెకరాలలో మామి డితోటకు నష్టం కలిగినట్లు నివేదికలు రూపొందించారు.



మోకన్‌పల్లిలో పంటను చూపుతున్న రైతు

గాలులకు ఎగిరిపోయిన పైకప్పు రేకులు

కమ్మర్‌పల్లి: మండలంలో శనివారం ఉదయం ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అమీర్‌నగర్‌లో నాలుగు ఇళ్ల పైకప్పు రేకులు, రెండు గుడిసెల పైకప్పులు లేచిపోయాయి. ఇనాయత్‌నగర్‌లో నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆర్ఐ శరత్‌కుమార్ ఘటన స్థలాలను పరిశీలించి, నష్టం అంచనా వివరాలను తహసీల్దార్‌కు నివేదించారు. ఉప్లూర్ గ్రామ శివారులోని రోడ్డుపై చెట్టు నేలకొరిగింది.



అమీర్‌నగర్‌లో వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ శరత్‌కుమార్

పెర్కిట్, ఆలూర్ పరిధిలో..



దేగాంలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంతో పాటు ఆలూర్ మండలంలో సాగు చేస్తున్న పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ శనివారం పరిశీలించారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద వరి కుప్పలను పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు.

మాక్లూర్ పరిధిలో..

మాక్లూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడిసి ముద్దయింది. చిక్లీలో భారీ చెట్టు విద్యుత్ వైర్లపై పడటంతో వైర్లు తెగిపడ్డాయి. ఈ ఘటనలో రెండు ద్విచక్రవాహనాలు సైతం నుజ్జునుజ్జయ్యాయి. చిక్లీ, వల్లభాపూర్ గ్రామాలకు 24 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

డొంకేశ్వర్‌లో 40 ఎకరాల్లో నేలవాలిన వరి



డొంకేశ్వర్ శివారులో నేలవాలిన నువ్వు

డొంకేశ్వర్(ఆర్మూర్): అకాల వర్షానికి డొంకేశ్వర్ మండలంలో 40 ఎకరాల్లో వరి పంట నేలవాలినట్లు మండల వ్యవసాయాధికారిణి జోత్స్న భావానీ తెలిపారు. వరితో పాటు పలుచోట్ల నువ్వుల పంట కూడా వాలిపోయింది. ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది.

నేలకొరిగిన నువ్వుల పంట

కమ్మర్‌పల్లి: మండలంలో శనివారం ఉదయం ఈదురు గాలులతో కూ డిన అకాల వర్షానికి ను వ్వు పంట పాక్షికంగా దెబ్బతింది. ఉప్లూర్, క మ్మర్‌పల్లి, హాసకొత్తూర్ గ్రామాల్లో కలిపి సుమారు 110 ఎకరాల్లో నువ్వు పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు వర్షానికి పాక్షికంగా తడిచిపోయింది. దెబ్బతిన్న పంటలను ఏఈఓలు పరిశీలించారు.



ఉప్లూర్‌లో పరిశీలిస్తున్న అధికారి

రైతులను ఆదుకోవాలి



నందిపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ శనివారం సీపీఐఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో నందిపేట తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన పడిగెంతు సాయన్న, దాసరి సాయిలు, మోనాజీ చిన్నారెడ్డిలకు చెందిన మూడు గేదెలు పిడుగుపాటుతో మృతి చెందాయని, ఆరబెట్టిన పొలాల్లో వడ్లు రాలిపోయాయని, వరిధాన్యం తడిసి ముద్దయిందని తెలిపారు. రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరారు. నాయకులు కె. గంగాధర్, దేవన్న తదితరులు ఉన్నారు.

ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు



వెల్మల్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

నందిపేట్(ఆర్మూర్): మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానతో విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం కలిగింది. సుమారు రూ.2.5 లక్షల విలువ గల ఆస్తి నష్టం జరిగింది. మండలంలో 50 విద్యుత్ స్తంభా లు విరిగి పోయా యి. 5 ట్రాన్స్‌ఫార్మ ర్లు, వైర్లు, ఇతర సా మగ్రి దెబ్బతిన్నా యి. కరెంట్ వైర్లు తెగడంతో చాలా గ్రా మాలలో చిమ్మ చీకట్లు నెలకొన్నా యి. విద్యుత్తు శాఖ సిబ్బంది శుక్రవారం సా యంత్రం ఆరు గంటల నుంచి శనివారం ఉద యం వరకు శ్రమించి గ్రామాలకు కరెంట్ సరఫరా పునరుద్ధరించారు.



కొల్‌పూర్ శివారులో విరిగిన విద్యుత్తు స్తంభం

రైతులకు అండగా కాంగ్రెస్



సాటాపూర్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

- బీఆర్ఎస్ శకం ముగిసింది.. అర్వింద్ ఎక్స్‌పైరీ తేదీ పూర్తయింది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి

రెంజల్/బాల్కొండ/ఎడపల్లి: రైతులకు అన్ని విధాలుగా కాంగ్రెస్ అండగా ఉంటుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు వరి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని తెలిపారు. రెంజల్ మండలం సాటాపూర్‌లో, ముప్కాల్ మండల కేంద్రంలో, ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో జీవన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, ఎంపీ అర్వింద్ ఎక్స్‌పైరీ తేదీ దగ్గర పడిందని అన్నారు. ఎన్నికల పూర్తయిన తర్వాత ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పారు.

కేసీఆర్ దత్తపుత్రుడు ప్రశాంత్ రెడ్డి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కేసీఆర్ దత్తపుత్రుడని విమర్శించారు. ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు చివరి తడి కోసం ఇబ్బంది పడుతుంటే ప్రశాంత్‌రెడ్డి ఎందుకు పట్టించు కోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కమీషన్ల కోసమే కేసీఆర్ నిర్మించారన్నారు. అందులో బాల్కొండ ఎమ్మెల్యేకు కూడా వాటా ఉందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వంలో పేదరికం పెరగడంతో పాటు నిరుద్యోగం, యువతలో నిరుత్సాహం పెరిగాయన్నారు. ఉన్న వారికి దోచి పెట్టడం తప్ప నిరుపేదలను పట్టించుకునే పరిస్థితి బీజేపీ ప్రభుత్వంలో లేదన్నారు. నిజామాబాద్ జిల్లా గతంలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందని నేడు అన్ని పరిశ్రమలు కాయలా పడ్డాయన్నారు. బోధన్ చక్కెర కర్మాగారాన్ని కాంగ్రెస్ పార్టీ తెరిపిస్తుందని చెప్పారు.

బీజేపీ నేతలు చెబితేనే పూజలు చేయాలా: సుదర్శన్ రెడ్డి

బీజేపీ నాయకులు చెబితేనే ఇళ్లల్లో పూజలు చేస్తామా అని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. మాజీ ఎంపీ కవిత బతుకమ్మతో, బీజేపీ నేతలు దేవాలయాల పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



బోధన్: సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ అయ్యప్ప సేవా శాఖ, గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ సెక్రెటరీ శ్రీనివాస్‌రావు, జోనల్ చైర్మన్ మారం ఆదినారాయణ రెడ్డి, ఎంపీటీసీ వెంకట్రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

రుద్రూర్: అంబం(ఆర్), రాణంపల్లి, చిక్కడపల్లి, రాయకూర్ తదితర గ్రామాల్లో శనివారం బీజేపీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. మండల బీజేపీ అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, కార్యదర్శి ఎముల గజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కుమ్మరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ ప్రారంభమైన అఖండ శివనామ సప్తాహం



బోధన్‌రూరల్: వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో 19వ అఖండ శివనామ సప్తాహం కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఏడు రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శివాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నే హనుమాన్ రావు, వీరశైవ సమాజ్ ప్రతినిధులు శ్యామ్ రావు, రాజేశ్వర్ పటేల్, అజయ్ కుమార్, విట్టలప్ప, ప్రభు అప్ప, తదితరులు పాల్గొన్నారు.

■ గోవిందగిరి ఆశ్రమంలో విశ్వకల్యాణ యజ్ఞం

వేల్పూర్: వేల్పూర్ శివారులోని గోవిందగిరి ఆశ్రమంలో శనివారం విశ్వకల్యాణార్థం బహుళ మహా యజ్ఞం నిర్వహించారు. యజ్ఞంలో వీడీసీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

■ మోస్రా రామాలయంలో ముగిసిన యజ్ఞం

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని రామాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యజ్ఞ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఆదివారం, సోమవారం వివిధ పూజా కార్యక్రమాలుంటాయని, భక్తులు హాజరు కావాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

■ హనుమాన్ శోభాయాత్ర

బాల్కొండ: మండల కేంద్రంలో హనుమాన్ మాల ధారణ భక్తుల ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో హనుమాన్ ఉత్సవ మూర్తులను ఊరేగించారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కమ్మర్‌పల్లి: నర్సాపూర్ పరిధిలోని సోమ్లానాయక్ తండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, భ్రూణ హత్యలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. బాలరక్షక్ భవన్ సిబ్బంది చిత్ర ప్రదర్శనతో అవగాహన కల్పించారు. ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ సరస్వతి, ఐసీపీఎస్ గణేష్, సీహెచ్‌ఎల్ పీసీ జ్యోత్స్న దేవి, జెండర్ స్పెషలిస్ట్ కవిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు జమున, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీడేస్ – 01.30, పారిజాతపర్వం – 4.50, లవ్ యూ శంకర్ – 7.45, మార్కెట్ మహాలక్ష్మి – 10.25
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) – 12.00, 3.00, 06.00, 9.00
స్క్రీన్-3 –	ది ఫ్యామిలీ స్టార్ –12.10, 6.40, గీతాంజలి మళ్లీ వచ్చింది – 3.25, టినెంట్ (తెలుగు)– 10.05
స్క్రీన్-4 –	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)– 12.45, 3.45, 6.45, 9.54

దైవ నామస్మరణతో ప్రశాంత జీవనం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: దైవ నామస్మరణ చేయడం వల్ల ప్రశాంత జీవనం ప్రాప్తిస్తుందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని కుమ్మన్‌పల్లి గ్రామ యువకులు పట్టుదల, భక్తిభావంతో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని ఆరాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. పూర్వీకుల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న భక్తి మార్గంలో యువత ముందుకు వెళ్లడం సంతోషకరమని తెలిపారు. శనివారం సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన హనుమాన్ దీక్ష మాలధారణ స్వామి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రతినిధి దొడ్ల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ శివారులో మాలధారణ స్వాములకు మండల భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలు కార్యక్రమానికి విచ్చేసి ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జీవన్ రెడ్డిలను హనుమాన్ మాలధారణ స్వాములు శాలువా, పూల మాలలతో సన్మానించారు.



సుదర్శన్ రెడ్డి, జీవన్ రెడ్డిలను సన్మానిస్తున్న హనుమాన్ మాలధారణ స్వాములు

కవి సమ్మేళనం

బోధన్: పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణ కేంద్రంలోని ఉషోదయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పీఠం అధ్యక్షుడు పురాణే అజయ్ కుమార్ మాట్లాడుతూ.. పీఠం ఆవిర్భావ నేపథ్యం, సాహితీ సేవలను వివరించారు. సమ్మేళనానికి బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ ప్రాంతాల నుంచి కవులు హాజరై స్వీయ కవితలను చదివి వినిపించారు. పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజయ్ కుమార్, పబ్బ మురళి, ప్రతినిధులు, ప్రైవేట్ విద్యాసంస్థల డైరెక్టర్లు శ్రీనివాస్‌రావు, కృష్ణ మోహన్, కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, కవులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంపా సాహితీ పీఠం అధ్యక్షుడు పురాణే అజయ్ కుమార్

గల్ఫ్ సంక్షేమ బోర్డుతో కార్మికులకు లబ్ధి

ఆర్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల గల్ఫ్ సంఘాల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఈ బోర్డు ఏర్పాటుతో ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహ నాయుడు పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలో శనివా రం గల్ఫ్ కార్మికుల ఐక్య వేదిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గల్ఫ్‌లో లేదా విదేశాల్లో చనిపోయిన కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నేతలు సాల్మన్‌రాజ్, మహమ్మద్ ఇబ్రహీం, చక్రి, మహమ్మద్ సమీర్, గురడిసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు రాజకీయాలు తగవు

మాక్లూర్: కాంగ్రెస్ నేత పొద్దుటూరు వినయ్ రెడ్డి బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్ హితవు పలికారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పాత పరిచయాలను ఆసరాగా చేసుకుని కొందరు బీజేపీ నాయకులను వినయ్ రెడ్డి మభ్యపెట్టి అవసరమైతే బెదిరించి కాంగ్రెస్ పార్టీలోకి తీసుకుంటున్నారని ఆరోపించారు. నేతలు చింత ప్రవీణ్, ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.